క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పవన్‌కుమార్

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీకి అండగా నిలిచి పార్టీ పటిష్టతకు ఉత్సాహంగా పని చేయాలని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు శ్రీమన్యం జగ్గమ్మగారి సత్రం మాజీ చైర్మన్, ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా కోశాధికారి నంబూరి శ్రీగంగాపవన్‌కుమార్ చెప్పారు. తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన నివాసంలో గురువారం కలిసినట్లు పవన్ కుమార్ స్థానిక విలేకరులకు తెలిపారు. పార్టీ పటిష్టతకు పలు సూచనలు చేశారన్నారు. రాబోయే రోజుల్లో అధికారంలోకి వస్తామని తనకు ధైర్యం చెప్పారన్నారు.

ముత్యాలమ్మ ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీని గురువారం లెక్కించారు. సుమారు 36 రోజుల కాలానికి గానూ రూ.6,91,761లు ఆదాయం లభించినట్లు ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు. ఈ లెక్కింపులో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు, పాలకవర్గ చైర్మన కడలి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి డీఎన్నార్ విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని సునీతను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థిని అత్యున్నత విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందడం అభినందనీయమని డీఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, విజయనగరంలో కెమిస్ట్రీలో పీజీ అడ్మిషన్ సాధించిన కళాశాల విద్యార్థిని శెట్టి సునీతను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శోభారాణి మాట్లాడుతూ ఆర్థికంగా ప్రోత్సాహం లేకపోయినా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి విద్యార్థి ఇలా ఉన్నత విశ్వవిద్యాలయంలో సీటు పొందడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినితో పాటు కెమిస్ట్రీ అధ్యాపకులు విజయ్‌స్వరూప్ సింగ్, విజయలక్ష్మిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: యుక్త వయస్సు రాకుండా వివాహాలు చేయడం ద్వారా కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ గ్రహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.విజయకుమారి, న్యాయవాదులు శిరీష, పద్మజ తదితరులు పేర్కొన్నారు. నరసాపురం మండలంలోని చిట్టవరం హైస్కూల్ ఆవరణలో శుక్రవారం మహిళా స్త్రీ,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. నక్కా ఆనందబాబు, ఎంపీటీసీ సభ్యుడు నక్కా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి



గోవిందరాజుల నాయుడు

పాలకొల్లు అర్బన్: దాళ్వా పంటకు సంబంధించి రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిలను ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్ ముగిసి నెలన్నర గడుస్తున్నా ధాన్యం బకాయిలు పూర్తిగా చెల్లించకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల వెతలను గమనించి బకాయిలను చెల్లించాలని కోరారు. అలాగే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం డబ్బులు పాఠశాలలు తెరిచే సమయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తల్లుల ఖాతాల్లో జమ చేసేవారని పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠశాలలు తెరిచి రెండు నెలలు కావస్తున్నా తల్లికి వందనం డబ్బులు ఇప్పటి వరకు జమ చేయలేదని మండిపడ్డారు.

ఖాళీ స్థలాలు.. సమస్యల నిలయాలు



మారుతీ థియేటర్ వెనుక ఇళ్ల మధ్యలో అధ్వానంగా ఉన్న ప్రైవేట్ స్థలం



12వ వార్డులో భవనాల మధ్య ఓ ప్రైవేటు స్థలంలో ఉన్న మొక్కలు

- పాలకొల్లులో ఖాళీ స్థలాలతో పారిశుద్ధ్య ఇబ్బందులు
- నీరు నిలిచిపోవడంతో దోమలు పెరుగుతున్నాయని ఆందోళన
- మునిసిపల్ రిజర్వ్ స్థలాలను సైతం పట్టించుకోని అధికారులు

పాలకొల్లు సెంట్రల్: వర్షాకాలం వస్తుందంటే సీజనల్ వ్యాధుల ప్రబలే ప్రమాదం ఉంటుందని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంటారు. ఈ ప్రచారంతో ప్రజల్లో కొంతవరకూ చైతన్యం కలిగి తమ ఇంటి పరిసరాలను ప్రతి రోజూ పరిశుభ్రం చేసుకుంటున్నారు. మరి ఇంటి చుట్టు పక్కల ఉండే ఖాళీ స్థలాల పరిస్థితి ఏంటి? అంటే ఎవ్వరి వద్ద సమాధానం లేదు. పట్టణంలో ఖాళీ స్థలాలు అధ్వానంగా ఉండడంతో వాటిలో మొక్కలు పెరిగి, వర్షం నీరు నిల్వ ఉండి దుర్వాసన రావడంతో స్థానిక ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పట్టణంలో ఉన్న 31 వార్డుల్లో సుమారు 80 వేల మంది జనాభా ఉన్నారు. ఇందులో ఇళ్లు నిర్మాణం చేసుకోవాలని స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న వారు కొందరైతే స్థిరాస్తులుగా ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు కొందరు ఉన్నారు. స్థిరాస్తుల కోసం కొనుగోలు చేసిన వారు మాత్రం తమ స్థలాలను ఖాళీగా ఉంచుతున్నారు. ఆ స్థలాలతోనే సమస్య వస్తుంది.

సమస్యలు ఇలా

ఖాళీ స్థలాల్లో చెత్త, చెదారం, మొక్కలు పెరిగిపోవడం అలాగే పక్క భవనంలో నివాసం ఉండే వ్యక్తులు చెత్తను ఆ ఖాళీ స్థలంలో వేయడంతో వ్యర్థాలు పెరిగిపోయి దుర్వాశన వస్తుంది. దాంతో పందులు, కుక్కలు, దోమలు స్వైర విహారం చేస్తూ ఉన్నాయి. అలాగే విష సర్పాలు, పురుగులు సైతం ఇళ్లల్లోకి రావడంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వీటి ప్రభావం వల్ల చుట్టు పక్కల స్థానికులు అనేక అనారోగ్యాలకు గురవుతున్నారు. ఏడేళ్ల క్రితం పట్టణంలో డయేరియా సంభవించి ముగ్గురు మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం ఖాళీగా ఉన్న స్థలాలేనని నాడు అధికారులు నిర్ధారించారు. ఇలా పట్టణంలో ఖాళీ స్థలాలు సుమారు 1500 వందల వరకూ ఉండవచ్చని మునిసిపల్ అధికారులు అంచనా వేస్తున్నారు. కొన్ని చోట్ల స్థల యజమానులు శుభ్రం చేస్తున్నా కొన్ని కొన్ని చోట్ల పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదు. కొన్ని స్థలాల్లో వర్షం నీరు నిల్వ ఉండపోవడంతో ఆ నీరు పసర్లుగా తయారవ్వడం అందులో పందులు స్వైర విహారం చేయడంతో దోమల విజృంభించిన అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంది.

మునిసిపల్ రిజర్వ్ స్థలాలు మరింత అధ్వానం

ప్రజల స్థలాలు అలా ఉంచితే మునిసిపల్ రిజర్వ్ స్థలాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. లే అవుట్లలో ఉన్న రిజర్వ్ స్థలాల్లో మురుగు నీరు చేరి మొక్కలు పెరిగిపోయి అత్యంత దారుణంగా ఉన్నాయి. రిజర్వ్ స్థలాలు పట్టణంలో దాదాపుగా 120 వరకూ ఉన్నాయి. మునిసిపల్ అధికారులు స్పందించి వీటి చుట్టూ పెన్సింగ్ వేసి, స్థలాన్ని చదును చేసి శుభ్రం చేయాలని అలాగే ప్రైవేటు ఖాళీ స్థలాల్లో మునిసిపల్ బోర్డులు ఏర్పాటు చేసి సంబంధిత యజమానులతో శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

దోమలతో ఇబ్బంది



ఇంటి వద్ద ఖాళీ స్థలాలు ఉండడంతో వాటిలో చెత్త పెరిగిపోయి నానా ఇబ్బందులు పడుతున్నాం. దోమలు, పాములు, విష పురుగులు ఇళ్లల్లోకి చేరిపోతున్నాయి. స్థలాలను శుభ్రం చేయాలని చెబుతుంటే స్థలాల యజమానులు మాపై కోపగించుకుంటున్నారు. మునిసిపల్ అధికారులే చర్యలుతీసుకుని కాళి స్థలాల్లో ఉన్న చెత్తను తొలగించేలా స్థల యజమానులకు నోటీసులు జారీచేయాలి.

– బొర్రా ఆదినారాయణమూర్తి, 17వ వార్డు

వర్షాకాలంలోనే సమస్యలు ఎక్కువ



వర్షాలు కురిస్తే ఖాళి స్థలాల్లో వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం ఉండడం లేదు. దాంతో కొద్ది రోజులకు ఆ నీరు పసర్లెక్కి దోమలు, విష పురుగులతో దుర్వాసన వస్తుంది. వేసవికాలం వస్తేనే తప్ప ఈ నీరు ఇంకే పరిస్థితి కనిపించడంలేదు. ఈ నీటిని బయటకు మళ్లించడానికి కూడా ఆస్కారం కనిపించడంలేదు. అధికారులు కనీసం ఇలాంటి ప్రాంతాల్లో ముగ్గు, దోమలమందులు వేయాలి.

– సలాది వేణు, 6 వ వార్డు

యజమానులకు నోటీసులు ఇస్తాం



పట్టణంలో ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిల్వ ఉంటే స్థానికులు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. పట్టణంలోఉన్న ప్రైవేటు ఖాళీస్థలాలు ఎప్పటికప్పుడు శుభ్రంచేయించాలని స్థల యజమానులకు నోటీసులు అందిస్తాం. వెంటనే ఖాళి స్థలాలను శుభ్రం చేయకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– విజయసారథి, మునిసిపల్ కమిషనర్, పాలకొల్లు

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



కొప్పర్రులో నష్టపోయిన రైతులకు సంఘీభావం ప్రకటిస్తున్న రైతుల సంఘాల నాయకులు

నరసాపురం రూరల్: అధిక వర్షాలు, వరదలు కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని రాష్ట్ర రైతుసంఘం, సర్వోదయ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం నరసాపురం మండలం కొప్పర్రు, మల్లవరం, సరిపల్లి గ్రామాల్లో నీట మునిగిన నారుముడులు, పంట చేలను పరిశీలించారు. తొలుత కొప్పర్రు గ్రామంలో సర్వోదయ రైతు సంఘం నాయకులతో కలిసి నష్టపోయిన రైతాంగానికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు పులఖండం వీర రాఘవులు, చినమిల్లి వీరబాబు, కూనపరెడ్డి రంగారావు, కలిదిండి గోపాలరాజు తదితరులు మాట్లాడుతూ గత దాళ్వా పంటకు సంబంధించి పంటను అమ్ముకున్న రైతులకు డబ్బులు చెల్లించడంలో జాప్యం జరుగుతోండటం వల్ల సార్వా సాగు ఆలస్యం జరగడంతో నారుమడి దశలోనే ఇప్పటికే రెండు పర్యాయాలు నారుముడుల పోసి నష్టపోయినట్లు రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

30న కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 30వతేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఏర్పాటు చేసినట్టు చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలు చర్చిస్తామని, సభ్యులు విధిగా హాజరుకావాలని కోరారు.

నీళ్లలోనే చేలు..ఆందోళనలో రైతులు



మొగల్తూరు గొల్లగూడెంలో చెరువులను తలపిస్తున్న చేలు

మొగల్తూరు: బంగాళాఖాతంలో మరోసారి అల్పపీడనం కారణంగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గత పది రోజులుగా కురిసిన వర్షాలకు చేలు మునిగిపోవడంతో వర్షాలు తగ్గినా నీరు లాగకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. మరోసారి వర్షాలు పడితే చేలు పూర్తిగా మునిగిపోవడంతో పాటు ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడి నష్టపోతామని రైతులు పేర్కొంటున్నారు. మొగల్తూరులోని ఇంజేటివారిపాలెం, నక్కావారిపాలెం, పాలకమ్మచెరవు, పెద్ద గొల్లగూడెం, ప్రాంతాలతో పాటు, రామన్నపాలెంలోని అడవిపర్ర, సుబ్రహ్మణ్య స్వామి గుడి ప్రాంతాలలోని వ్యవసాయ భూములు నీటమునిగాయి. మరోసారి వర్షం కురిస్తే ఇప్పటికే నాట్లు వేసుకున్న చేలతో పాటు ఆకుమడులు పూర్తిగా నీటమునిగిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆదాయపు పన్ను దాఖలుపై అవగాహన



చాంబర్స్ కళాశాలలో ఐటీ అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ఆదాయపన్ను అనేది స్వచ్ఛందంగా నైతిక బాధ్యతగా ప్రభుత్వానికి చెల్లించే రుసుముగా భావించాలని ఐటీ అధికారి శ్రీరామ చంద్రమూర్తి అన్నారు. గురువారం స్థానిక చాంబర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఏర్పాటుచేసిన ఆదాయపన్నుపై అవగాహనా సదస్సు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఐటీ పరిధిలో ఉండే ప్రతి ఒక్కరూ ఆదాయపన్నును సక్రమంగా చెల్లించడం వల్ల దేశ సంక్షేమానికి, అభివృద్ధికి సహకరించినవారవుతారన్నారు. ఐటి అనేది వాణిజ్యపరమైన అంశం కాదని ప్రత్యక్షంగా ప్రభుత్వానికి చెల్లించే రుసుముగా భావించాలన్నారు. నిర్దేశించిన పరిధి దాటిన ఆదాయంపై ప్రతి పౌరుడు విధిగా పన్ను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహారావు, సెక్రటరీ కె.రామరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, ఆడిటర్ పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి



స్థానిక అధికారులకు సూచనలిస్తున్న నరసాపురం ఆర్డీఓ అచ్యుత అంబరీష్

పోడూరు: వరదముంపు ప్రాంతాల్లో ప్రభుత్వ యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని నరసాపురం ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ ఆదేశించారు. వద్దిపర్రు గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. వరద ముంపుతో గ్రామంలోని పంటచేలతో పాటు గ్రామానికి ప్రధాన రవాణా మార్గమైన ఆర్ అండ్‌బీ రహదారి నీటమునిగింది. అనేక నివాసాలను వరద నీరు చుట్టుముట్టింది. ఈ పరిస్థితుల్లో ట్రాక్టర్‌పై ప్రభుత్వ సిబ్బందితో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. వరద తీవ్రతను పరిశీలించిన ఆర్డీఓ వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వరద తీవ్రత తగ్గాగ నారుమడులు వేసుకునేందుకు రైతులకు సబ్సిడీపై వరివిత్తనాలు పంపిణీ చేయాలని వ్యవసాయశాఖ అధికారులను, గ్రామ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను, పునరావాస కేంద్రంలో బాధితులకు భోజనం, అల్పాహారం తదితర సదుపాయాలన్నీ సక్రమంగా అందేలా చూడాలనీ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ బీవీ మురళీకృష్ణ, సర్పంచ్ వడ్లపాటి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు విప్పర్తి శారద ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నరసాపురం రూరల్: పాఠశాల విద్యారంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ గురువారం నరసాపురం యూటీఎఫ్ సంఘం ఆధ్వర్యంలో ఎంఈఓ పుష్పరాజ్యానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి పి కృష్ణకుమారి, జీఎస్ఎస్ఆర్ స్వామి తదితరులు 20 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓకు అందజేశారు. కార్యక్రమంలో పి.శ్యామ్‌సన్, ఎన్వీ సత్యనారాయణ, ఎస్.అజయ్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ నాయకురాలి హర్షం

పాలకొల్లు సెంట్రల్: పేద ప్రజలు, రైతులు, యువత, మహిళల అభ్యున్నతి వికసిత భారత్ లక్ష్యంగా 9 ప్రాధాన్య అంశాలతో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రకటించడం అభినందనీయమని జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు అల్లూరి పద్మవర్మ అన్నారు. ఈ మేరకు బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌కు నిధులు కేటాయింపు, ఏడు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు వంటి కేటాయింపులపై ఆనందం వ్యక్తం చేశారు.

ఎంపీడీఓ రమణారావుకు ఘన నివాళి

పాలకొల్లు అర్బన్: విధి నిర్వహణలో ఎంతో నీతి, నిజాయితీ గా పనిచేసి ప్రజల మన్ననలు పొందిన నరసాపురం ఎంపీడీఓ ఎం.వెంకటరమణారావు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం విచారకరమని పలువురు సంతాపం వ్యక్తం చేశారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం రమణారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.అనుపమ, ఎంఈఓలు ఎం.వీరాస్వామి, ఆర్ఎస్‌వీఎస్ గంగాధర శర్మ, ఈఓపీఆర్‌డీ కేఎం వైభవతి పాల్గొన్నారు.

మరింత పెరిగిన గోదావరి నీటిమట్టం



వలంధర్‌రేవులో పిండ ప్రదానం షెడ్డు సగం వరకు చేరిన గోదావరి



లలితాంబ ఘాట్ వద్ద నీట మునిగిన బల్లలు



కోడేరులో నిలకడగా గోదావరి

నరసాపురం: నరసాపురంలో వశిష్ట గోదావరి ఉగ్రరూపంలో ప్రవహిస్తోంది. దీంతో గోదావరి పరివాహక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భద్రాచలంలో నీటమట్టం తగ్గుతూ ఉండటంతో ఎగువ ప్రాంతాల నుంచి వశిష్ట గోదావరిలోకి నీరు భారీగా వచ్చి చేరుతుంది. భారీగా వస్తున్న నీరు సముద్రంలో కలుస్తుంది. అయితే సముద్రం పోటు సమయంలో నీరు నిలిచిపోవడంతో స్థానికంగా నీటిమట్టం పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి సముద్రంలో కలవడానికి నీరు వస్తూ ఉన్నంత వరకూ స్థానికంగా నీటిమట్టం పెరుగుతూనే ఉంటుంది. వలంధర్‌రేవులో స్నానాలరేవు వద్ద ప్రమాదకర స్థితిలో నీటి ప్రవాహం ఉంది. పిండప్రదానం షెడ్డు పూర్తిగా మునిగిపోయింది. మాధవాయిపాలెం రేవులో పంటు రాకపోకలు గురువారం కూడా కొనసాగించలేదు. ఎగువ ప్రాంతాల్లో వరద తీవ్రత తగ్గినా మరో రెండు మూడు రోజులు నరసాపురంలో గోదావరి ఉధృతి ఇలాగే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సిద్ధాంతంలో నిలకడగా గోదావరి

పెనుగొండ: వశిష్ట గోదావరి ఉధృతి తగ్గు ముఖం పట్టింది. ఎగువ నుంచి వరద నీరు జోరు తగ్గడంతో నెమ్మదిగా గోదావరి మాత శాంతిస్తుంది. సిద్ధాంతంలో రెండు అడుగుల నీటి మట్టం దక్కింది. కేదారీఘాట్‌లోని పుష్కర రేవులు గోదావరి నీటి ముంపు నుంచి బయట పడ్డాయి. తగ్గుముఖం పట్టడంతో పరిసర ప్రాంతాలకు చెందిన వారు గోదావరి మాతకు పసుపు కుంకుమలు సమర్పించి పూజలు నిర్వహిస్తున్నారు. నీటి మట్టం తగ్గుతుండడంతో అధికారులు, రైతుల ఊపిరి పీల్చుకొన్నారు. మధ్యస్థ లంకలోకి రాకపోకలు యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఉధృతి పెరిగితే మధ్యస్థ లంకలోని పాడి పశువులను ఏటిగట్టుకు చేర్చడానికి రైతులు స్వయంగా ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే వరద ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో ఏటిగట్టుకు తీసుకువచ్చే ప్రయత్నాలు విరమించుకున్నారు.

ఆచంట మండలంలో ..

ఆచంట మండలంలోని పెదమల్లం లంక, అయోధ్య లంక, పల్లేపాలెం, భీమలాపురంల్లోనూ గోదావరి నీటి మట్టం తగ్గడంతో లంకల్లోని ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. పంట పొలాలు ఇంకా నీటిలోనే మునిగి ఉన్నాయి, మరింత తగ్గితే తప్ప పంట పొలాలు బయటపడే అవకాశం లేదు. లంకవాసుల రాకపోకలు కొనసాగిస్తున్నారు. అయోధ్యలంక పంచాయతీ, పాఠశాల, రామాలయం ప్రాంతంలో వరద నీరు ఇంకా ప్రవహిస్తుంది. మరో రెండురోజులు ఆగితే పూర్తిగా వరద నీరు తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు. కోడేరులో వరద ఉధృతి నెమ్మదిగా తగ్గుతుంది.

గొందిమూలలో శిక్షా సప్తాహ్



గొందిమూల ప్రాథమిక పాఠశాలలో వివిధ వేషధారణల్లో విద్యార్థులు

నరసాపురం రూరల్: విద్యార్థుల్లో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడానికి శిక్షా సప్తాహ్ వారోత్సవ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని హెచ్ఎం ఉప్పుగంటి రాజశ్రీ పేర్కొన్నారు. గురువారం నరసాపురం మండలంలోని గొందిమూల ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణలతో అలరించారు.

నిత్యాన్నదానానికి రూ.55 వేల విరాళం

భీమవరం: పట్టణంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానం పథకానికి ఆకివీడుకు చెందిన ఎస్.తేజ., ధరణి దంపతులు వారి కుమారుడు ఎస్.మురారి విశాల్ పేరున గురువారం రూ. 55 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పౌష్టికాహారంతో వ్యాధులు దూరం



కొడమంచిలి మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: చిన్నారులల్లోనూ, కిశోర బాలికల్లోనూ, గర్భిణుల్లోనూ పౌష్టికాహారంతో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందింపజేయవచ్చని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి అన్నారు. గురువారం పెనుగొండ పంచాయతీ వద్ద ఆధార్ కేంద్రం నిర్వహణను ప్రారంభించి, ఐసీడీఎస్ మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయ కుమారి, జెడ్పీహెచ్ హెచ్ఎం పి.భరణీకుమార్ పాల్గొన్నారు.

కొడమంచిలిలో

ఆచంట మండలం కొడమంచిలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ వందరోజుల మిషన్ శక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవహారం నిర్వహించి ఆకట్టుకొన్నారు. పని ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న లైంగిక వేదింపుల నిరోధానికి గాను ప్రభుత్వం చేపట్టిన చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్‌సూపర్‌వైజర్ డీవీఆర్ఎస్ కుమారి తెలిపారు.

విద్యాసామగ్రి అందజేత



విద్యాసామగ్రి అందిస్తున్న దాతలు

పోడూరు: విద్యతోనే మనదేశం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తుందని డీసీసీబీ మాజీ డైరెక్టర్, దాత దేవళ్ల ప్రసాద్ అన్నారు. జిన్నూరులోని ఏఎస్ఆర్ జెడ్పీ హైస్కూల్, ఎస్ఆర్‌పేట, భూపయ్యచెరువు, చాకిరేవుగుంట ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ×మనకోసం మనం¤ సేవాసంస్థ ఆధ్వర్యంలో దాత దేవళ్ల ప్రసాద్ ఆర్థికసాయంతో గురువారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాత ప్రసాద్, ×మనకోసం మనం¤ సేవాసంస్థ అధ్యక్షుడు పడాల పెద్దిరాజు లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోదన జరుగుతుందని అన్నారు. నీటిసంఘం మాజీ అధ్యక్షులు దేవళ్ల శ్రీరామకోటి మోహన్, సేవా సంస్థ సభ్యులు కలిశెట్టి కనకారావు, కలిశెట్టి లక్ష్మి, పడాల కృష్ణవేణి, సిద్ధార్థ, దాసరి సత్యనారాయణ పాల్గొన్నారు.